క్లుప్తంగా

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన



వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు గ్రామంలో సచివాలయ ఉద్యోగులు జీఎస్టీ తగ్గింపై ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం పంచాయతీ పరిధిలోని అన్ని కాలనీల్లో ఇంటింటికీ తిరిగి నిత్యావసర సరుకులు, దుస్తులు, ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు సంబంధించి ఎంత మేరకు జీఎస్టీ తగ్గించారో వివరించారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



మనుబోలు: మనుబోలులోని విజయ డెయిరీలో 2024 – 25 సంవత్సరంలో పాలు పోసిన 70 మంది పాడి రైతులకు దసరా సందర్భంగా రూ.1.75 లక్షల బోనస్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డెయిరీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రూ.1.30 కోట్ల విలువైన పాలను డెయిరీకి సరఫరా చేశారని తెలిపారు. కార్యక్రమంలో డెయిరీ సెక్రటరీ శ్రీనివాసులురెడ్డి, డైరెక్టర్లు రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగాలో గోల్డ్ మెడల్



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర యోగా పోటీల్లో జిల్లాలోని కోవూరుకు చెందిన ప్రసూనకు సోమవారం గోల్డ్ మెడల్ లభించింది. విజయవాడలో జరుగుతున్న ఆరో జూనియర్, సీనియర్–సీ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో నాలుగో రోజు మహిళా విభాగంలో సీనియర్ కేటగిరీలో జిల్లాకు చెందిన ప్రసూన అవార్డు సాధించడంపై జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ పెంచలయ్య, ఉపాధ్యక్షుడు ఎం.రవీంద్ర, కార్యదర్శి జ్యోతి రాజేంద్రకుమార్, కోచ్ మానస, కమిటీ సభ్యులు పద్మావతి, కావ్య అభినందనలు తెలిపారు.

వ్యభిచార కేంద్రంపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఇళ్ల మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతోన్న వ్యభిచార కేంద్రంపై దర్గామిట్ట పోలీసులు దాడులు చేశారు. నిర్వాహకులు పరారీలో ఉండగా విటుడిని పోలీసులు అరెస్ట్ చేసి, ఇద్దరు సెక్స్ వర్కర్లను హోమ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన కల్యాణి, మురళి అనే ఇద్దరు పోస్టల్ కాలనీ మూడో వీధిలోని ఓ ఇంటిని రెండు నెలల కిందట అద్దెకు తీసుకున్నారు. ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన యువతులను తీసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నారు. దీనిపై సోమవారం దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఎం.రోశయ్యకు సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో ఇంటిపై దాడి చేశారు. విటుడు పొదలకూరు మండలానికి చెందిన మహేష్‌ను అరెస్ట్ చేసి ఇద్దరు సెక్స్‌వర్కర్లను అదుపులోకి తీసుకుని హోమ్‌కు తరలించారు. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ పరారీలో ఉన్న ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రెండు కార్ల ఢీ



దెబ్బతిన్న కారు

సంగం: మండలంలోని సంగం కొండ కూడలి వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆత్మకూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు స్పీడ్ బ్రేకర్ వద్ద స్లో చేయగానే వెనుకగా వేగంగా వస్తున్న మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతినగా అందులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఇన్‌చార్జి ఎస్సై సైదులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేపట్టారు. సంగం మండల పరిధిలో జాతీయ రహదారిపై నిత్యం ఏదోక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనచోదకులు హడలిపోతున్నారు. జాతీయ రహదారి అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వైద్య శిబిరాలకు దూరం

- హాజరు కాని వైద్యులు
- నేటి నుంచి పీహెచ్‌సీలకు సైతం గైర్హాజరు
- ఆస్పత్రుల వద్ద రోగుల ఇబ్బందులు



కేఆర్‌ఆర్ నగర్‌లో వైద్యశిబిరానికి వచ్చిన మహిళలు

పొదలకూరు: దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విధులను బహిష్కరిస్తున్న నేపథ్యంలో సోమవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ యోజన శిబిరాలకు హాజరు కాలేదు. దీంతో గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో వైద్య సిబ్బందే మహిళల ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాల్సి వచ్చింది. సోమవారం పొదలకూరు పట్టణంలో సచివాలయం బిట్ – 1, బిట్ – 2 పరిధిలో మహిళల కోసం ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించారు. వీటికి డాక్టర్లు హాజరుకాలేదు. మండలంలో మహ్మదాపురం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఇక్కడ ఇద్దరు డాక్టర్లు, పొదలకూరు కో – లొకేటెడ్ పీహెచ్‌సీలో ఇద్దరు మహిళా వైద్యులున్నారు. వీరు ఆస్పత్రుల్లో సేవలందించినా ప్రత్యేక వైద్య శిబిరాలకు వెళ్లలేదు. ఫలితంగా సిబ్బంది రక్త పరీక్షలు చేసి పంపారు. అయితే శిబిరాలకు హాజరైన మహిళలు నిపుణులైన డాక్టర్లు హాజరవుతారని దీర్ఘకాలిక జబ్బులకు పరీక్షలు చేయించుకునేందుకు వచ్చారు. వారు గైర్హాజరు కావడంతో వెనుదిరగాల్సి వచ్చింది.

నిరసన కార్యక్రమాలు

పీహెచ్‌సీ వైద్యులు మంగళవారం నుంచి విధులను బాయ్‌కట్ చేస్తున్నారు. ఆస్పత్రులకు రాకుండా నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇందువల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఆస్పత్రులకు వెళ్లే పేదలకు తీవ్ర ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. ఆరోగ్య సిబ్బంది ఉన్నా చిన్నపాటి వ్యాధులకు మాత్రమే మందులను అందజేయగలరు. తమ సమస్యలపై అసోసియేషన్ పిలుపు మేరకు దశల వారీగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటామని మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు వెల్లడించారు. విధులకు హాజరయ్యేది లేదని, ర్యాలీలు చేస్తామని చెప్పారు.

కామాక్షితాయి ఆస్తులను కాపాడాలి

- కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపిన భక్తులు



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న కామాక్షితాయి భక్తులు తదితరులు

నెల్లూరు(అర్బన్): బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడ గ్రామంలోని కామాక్షితాయి దేవస్థానానికి చెందిన ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఆ దేవస్థానం చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, మాజీ చైర్మన్ రమేష్‌బాబు, వరదరాజస్వామి దేవస్థానం చైర్మన్ సాగర్ కోరారు. ఈ మేరకు పలువురు భక్తులతో కలిసి వారు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపి కలెక్టర్ హిమాన్షు శుక్లాకు అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని సర్వే నంబర్ 91/16, 94, 129లలో అమ్మవారికి చెందిన 90 సెంట్ల మెట్ట భూమి ఉండేదన్నారు. అక్కడ పూలు పండించి అమ్మవారి అలంకరణకు వినియోగించేవారన్నారు. తర్వాతి కాలంలో ఆ భూమిని లీజుకు ఇచ్చారన్నారు. అయితే వారు లీజు ఇవ్వకపోవడంతో కోర్టుకెళ్లగా కోర్టు లీజు చెల్లించడంతో పాటు భూమిని దేవస్థానానికి స్వాధీనం చేయాలని తీర్పు ఇచ్చిందన్నారు. అయితే శ్రీశైలం కృష్ణమూర్తి, సతీష్ శర్మ, గిరిధర్‌లు ఆ భూమిని నెల్లూరులోని ఏటుకూరి మల్లీశ్వరికి అమ్మినట్టు నకిలీ పత్రాలు తెచ్చారన్నారు. ఇప్పుడు ఏకంగా ఆ భూమిని చదును చేసి ప్లాట్లు చేసి అమ్మేందుకు పూనుకున్నారన్నారు. రూ.5 కోట్ల విలువైన ఈ భూమిని కబ్జా చేశారంటూ పత్రికల్లో కథనాలు కూడా వచ్చాయన్నారు. దీనిపై బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దార్‌కు తెలిపినప్పటికీ ఆయన పట్టించుకోవడం లేదని, కలెక్టర్ జోక్యం చేసుకుని అమ్మవారి ఆస్తులను కాపాడాలన్నారు కలెక్టర్ సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, శివకుమార్, లక్ష్మయ్య, బాలకృష్ణ, నవీన్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభగిరిపట్నం మాజీ సర్పంచ్ మృతి

- నివాళులర్పించిన మాజీ మంత్రి కాకాణి



నివాళులర్పిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: మండలంలోని ప్రభగిరిపట్నం మాజీ సర్పంచ్ పిల్లిపోగు పెంచలయ్య (80) అనారోగ్య కారణాలతో సోమవారం మృతిచెందారు. ప్రస్తుతం పెంచలయ్య సతీమణి వెంకమ్మ ప్రభగిరిపట్నం సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. అంతకుముందు ఆయన కుమారుడు పెంచలప్రసాద్ పని చేశారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పెంచలయ్య భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తమ కుటుంబానికి పెంచలయ్య ఆప్తుడని చెప్పారు. తన తండ్రి కాకాణి రమణారెడ్డి అనుచరుడిగా దశాబ్దాల తరబడి కొనసాగినట్టు వెల్లడించారు. గోవర్ధన్‌రెడ్డి వెంట మద్దిరెడ్డి రమణారెడ్డి, పెంచలయ్య కుమారులు పెంచలప్రసాద్, పెంచలయ్య, వార్డు సభ్యుడు ప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జి.పెంచలయ్య తదితరులున్నారు.

అటుకుల కోసం..

- బారులు తీరుతున్న గ్రామీణులు



నరుకూరు సెంటర్‌లో వడ్ల బస్తాల్ని పెట్టారిలా..



అటుకుల ఆడిస్తున్న కార్మికులు

తోటపల్లిగూడూరు: మండలంలోని నరుకూరు, కోడూరు, తోటపల్లిగూడూరు సెంటర్లలో అటుకులు ఆడించే మెషీన్లను ఏర్పాటు చేశారు. సాధారణంగా ఖరీఫ్ సీజన్ కోతలు ముగిశాయంటే అటుకుల కోసం గ్రామీణులు ఆసక్తి చూపుతుంటారు. ఈ క్రమంలో విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన కొందరు మండలంలోని పలు ప్రాంతాల్లో మెషీన్లను ఏర్పాటు చేశారు. మండల పరిసర గ్రామాల నుంచి జనం వాటి వద్దకు పరుగులు తీస్తున్నారు. దీంతో గతేడాది కేజీ వడ్లకు రూ.8లు వసూలు చేసిన వారు నేడు రూ.10 నుంచి రూ.12 వరకు తీసుకుంటున్నారు. అయినా గ్రామీణులు వెనుకంజ వేయడం లేదు. అటుకుల కోసం ఒక్కొక్కరు 10 నుంచి 20 కేజీల వరకు వడ్లను తీసుకొచ్చి గంటలపాటు నిరీక్షిస్తున్నారు.

చినుకు పడితే చిత్తడే



నార్తురాజుపాళెంలో బురదమయంగా ఉన్న ప్రధాన రహదారి

- అధ్వానంగా రోడ్డు

కొడవలూరు: చిన్నపాటి వర్షం కురిసినా నార్తురాజుపాళెంలో కాలు మోపలేని పరిస్థితి నెలకొంటోంది. మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. దీంతో నార్తురాజుపాళెం గోల్డన్ నగర్ వద్ద మెయిన్ రోడ్డుకు ఇరువైపులా వర్షపు నీరు నిలిచి రోడ్డు బురదమయంగా మారింది. ఈ ప్రాంతంలో ఎక్కువగా లారీ సప్లయ్ కార్యాలయాలు, వే బ్రిడ్జిలున్నాయి. పైగా ఇప్పుడు వరికోతల సమయం కావడంతో ధాన్యం లారీలు ఇక్కడకు ఎక్కువ సంఖ్యలో వస్తున్నాయి. ఫలితంగా రోడ్డంతా బురదమయంగా మారింది. గుంతల్లో వర్షపునీరు నిలిచి రోడ్డు కనిపించని పరిస్థితి నెలకొంది. పాదచారులైతే బురదలో అష్టకష్టాలు పడుతూ వెళ్లాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకిరువైపులా ఉన్న గుంతలకు మట్టి తోలడంతో పాటు రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చాల్సిన అవసరం ఉంది.

సీజనల్ వ్యాధులపై అవగాహన



వెంకటాచలం: మండలంలోని చవటపాళెం గ్రామంలో సోమవారం సీజనల్ వ్యాధుల వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ప్రవల్లిక మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రజలు అశ్రద్ధ చూపొద్దని సూచించారు. ఏదైనా వ్యాధులు సోకిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యకరం



ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయల్ని అందజేస్తున్న తహసీల్దార్

కొడవలూరు: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను వినియోగించడం ఆరోగ్యకరమని తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొనుగోలుదారులకు కూరగాయలను తహసీల్దార్ చేతుల మీదుగా అందించి మాట్లాడారు. రసాయన ఎరువులు వినియోగించకుండా ప్రకృతి సిద్ధమైన సేంద్రియ ఎరువులనే వినియోగించి పండించిన కూరగాయలు, ఆకుకూరలు వినియోగించడం ఆరోగ్యానికి శ్రేయస్కరమన్నారు. ఏఓ ఎస్.వి జయలక్ష్మి మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలకు మార్కెట్‌లో మంచి ధర లభ్యమవుతోందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహమిస్తోందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రామ్‌ప్రసాద్, రవీంద్ర, రాణి, నేతాజి అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు కోవూరు వెంకీ, సభ్యుడు పిట్టి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారంలో అన్యాయం

- అధికారులకు వినతిపత్రం అందజేత



మాట్లాడుతున్న గ్రామస్తులు

నెల్లూరు(అర్బన్): పరిహారం విషయంలో అన్యాయం జరుగుతోందని పొదలకూరు మండలం కనుపర్తి పంచాయతీకి చెందిన రేణంగి నారాయణ, పాశం పెంచలయ్య, సుందరయ్య తదితరులు తెలిపారు. సోమవారం వారు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ నేషనల్ హైవే 67 నంబర్ రోడ్డు మా గ్రామం మీదుగా పోతోందన్నారు. 9 మంది పొలాలు ప్రభుత్వం తీసుకున్నట్లు చెప్పారు. రెండేళ్ల క్రితమే 9వ పేరున్న సుబ్బారావుకు ఎకరాకు రూ.7.80 లక్షల చొప్పున పరిహారం ఇచ్చిందన్నారు. ఇప్పుడు ఎకరాకు రూ.5 లక్షల నష్టపరిహారం ఇస్తామని రెవెన్యూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. బోర్లు వేసుకుని పంటలు పండించుకుంటున్నామని, తక్కువ పరిహారం ఇస్తామని చెప్పడం అన్యాయన్నారు. అలాగే దేవస్థానానికి చెందిన భూముల్లో నిమ్మ పంటలు సాగు చేస్తున్నామని, వాటికి కూడా పరిహారం ఇచ్చేది లేదంటున్నారని, ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మాతమ్మ

కొడవలూరు: భర్త చనిపోయినందున ఆయన పేరుపై ఉన్న పొలాన్ని తన పేరుపై మార్చాలంటూ చంద్రశేఖరపురానికి చెందిన మాతమ్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డికి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మృతిచెందిన తన భర్త పేరుపై పొలం ఉండడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రభుత్వ పథకాలకు సైతం దూరమవుతున్నామని మొరపెట్టుకున్నారు. భర్త పేరుపై ఉన్న పొలాన్ని తనపై మార్చి ఆదుకోవాలని విన్నవించుకొన్నారు. తహసీల్దార్ సమాధనిమిస్తూ విచారించి పేరు మార్పునకు చర్యలు తీసుకోవాలని వీఆర్వోను ఆదేశిస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట



కొడవలూరు : మహిళలకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఏ షఫీ ఉద్దీన్



పొదలకూరు : శిబిరానికి విచ్చేసిన వారు

కొడవలూరు: మహిళల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని హెచ్‌ఏ షఫీ ఉద్దీన్ తెలిపారు. 'స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్' కార్యక్రమంలో భాగంగా నార్తురాజుపాళెం దళితవాడలో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి వైద్య సలహాలిచ్చారు. అనంతరం హెచ్‌ఏ మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, గ్రామం, రాష్ట్రం, దేశం బాగుంటాయన్న ఉద్దేశంతో ప్రధాన మంత్రి మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు కె.మల్లికార్జున, ఎంఎల్‌హెచ్‌పీలు సరోజ, స్నేహ, ఏఎస్‌ఎం దొరసానమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌సుందర్, ఆశా కార్యకర్త జి.రమ పాల్గొన్నారు.

⇨ పొదలకూరు: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్ పర్యవేక్షణలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మహిళలు, కిశోర బాలికలకు డాక్టర్లు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. తొలుత వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

సకాలంలో టీకాలు వేయించాలి



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కొడవలూరు: పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ సూచించారు. పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా నార్తురాజుపాళెంలో పిల్లలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు సకాలంలో టీకాలు వేయించకపోతే వివిధ రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. గర్భిణులు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. పోషకాహార లోపం తలెత్తితే బిడ్డపై ప్రభావం చూపుతోందన్నారు. తక్కువ ధరకే లభ్యమయ్యే పోషక విలువలున్న ఆహారాన్ని ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్యాంసుందర్, విజయ్, అంగన్‌వాడీ కార్యకర్త పి.విజయమ్మ, హెల్పర్ శ్రావణసంధ్యా పాల్గొన్నారు.

లోకమాత రూపం.. భక్తజన పరవశం



పొదలకూరు : మరుపూరులో సరస్వతి అలంకారంలో అమ్మవారు



పొదలకూరు : వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు

పొదలకూరు: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో సోమవారం దర్శనమిచ్చారు. ఉదయం లలిత సహస్రనామార్చన, ఖడ్గమాల పూజలు జరిగాయి.

⇨ మండలంలోని మరుపూరు గ్రామంలో కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేశారు. ఉభయకర్తలుగా వల్లూరు గోపాల్‌రెడ్డి, వల్లూరు విజయకుమార్‌రెడ్డి వ్యవహరించారు.

⇨ పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు విద్యాలక్ష్మిగా దర్శనమిచ్చారు.

⇨ పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి (శివాలయం) ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ప్రసాద్‌స్వామి, కుమార్‌స్వామి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

⇨ మనుబోలు: మండలంలోని మనుబోలు కోదండరామపురంలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు సోమవారం సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు పంచామృతాభిషేకం చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆరూరు అనిల్‌కుమార్ రెడ్డి, అనిత వ్యవహరించారు.

⇨ తోటపల్లిగూడూరు: మండలంలోని ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం నరుకూరు ఇందిరాకాలనీలో రాజరాజేశ్వరి ఆలయంలో, వరిగొండ దేవళాలమిట్టలో ఉన్న జ్వాలాముఖి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం 9 గంటలకు పల్లకి సేవ జరిగింది. పూజా కార్యక్రమాలకు దొడ్ల రామలింగారెడ్డి ఉభయకర్తగా వ్యవహరించారు.

⇨ ఇందుకూరుపేట: శరన్నవరాత్రుల సందర్భంగా గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారు సోమవారం మహా సరస్వతీదేవిగా భక్తులను కటాక్షించారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి పల్లకిసేవ వైభవంగా జరిగింది. ఉభయదాతలుగా స్థానికులు కేతిరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి– సంధ్య దంపతులు వ్యవహరించారు. అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో వేదపండితులు ఆలయంలో వేదపఠనం చేశారు.



టీపీగూడూరు : సరస్వతీదేవి అలంకారంలో రాజరాజేశ్వరి అమ్మవారు

కలు జరిగాయి.

⇨ బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో సోమవారం అమ్మవారు సరస్వతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పుణ్యాహవచనం, కలశపూజలు, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, మహా నవావరణ పూజ నిర్వహించారు. భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.



మనుబోలులో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కామాక్షితాయి ఆలయంలో పూజలు



ఇందుకూరుపేట: చాముండేశ్వరీదేవి ఆలయంలో..